యథార్థగాథ

# సింహం మెడలో రహస్యం దాచిన గూఢచారి

1988 సెప్టెంబర్ 2వ తేదీరాత్రి పదిన్నర గంటలు కావస్తోంది. అమెరికాలో జాఫర్‌సన్ సిటీలో నిర్మానుష్యమైన ఒక కార్నర్‌లోగల ఆరంతస్థుల బిల్డింగ్ విద్యుత్ దీపాల వెలుగులో దీపావళి మతాబూలా కన్పిస్తోంది.

ఆ బిల్డింగ్ చూట్టూ సైనిక కావలా పకడ్బందీగా ఉంది. అనుమానితుడు అనే వాడ్ని పిట్టను కాల్చినట్టు కాల్చడానికి పూర్తి స్వేచ్ఛ ఉన్న కావలా మనుష్యులు అక్కడ ఉన్నారు. మరి బూట్ల చప్పుడు సయితం విన్పించని అతి మెత్తని ఫ్లోరింగ్ ఎవరూ కన్పించని విధంగా ఒక్కొక్కరు చిన్న చిన్న రౌండ్‌ఫోల్స్ చీలికల్లో నిలబడున్నారు. బయట్నించి చూసేవారికి నిర్మానుష్యంగా ఉండే బిల్డింగ్ అనిపిస్తుంది. అందులో ప్రపంచ వినాశకరమైన అత్యంత ప్రమాదభరితమైన ఆయుధాల గూర్చి చర్చలు క్రొత్తగా కనిపెట్టబడిన వాటి ఫార్ములాలు గూర్చి సైంటిస్టు వివరణలు, తర్జన భర్జనలు, లేదా ప్రభుత్వానికి ఫార్ములాల సమర్పణలువంటివి జరుగుతుంటాయి.

ఆ రోజు ఒక యుద్ధ విమానం గూర్చి పూర్తి నివేదిక సమర్పించేందుకు పీడర్ ఫ్లోరిన్ అనే సైంటిస్టు కారులో వస్తున్నాడు. ఆ కారు జాఫర్‌సన్ సిటీలో ప్రవేశించి వాయువేగంతో దూసుకుపోతోంది. అతని వయస్సు నలభై ఏళ్ళుంటాయి. తొలిసారిగా చాలా శ్రమించి తయారుచేసిన యుద్ధ విమానం ప్రభుత్వానికి అందచేసి చాలా ఎక్కువ మొత్తంలో రెమ్యూనరేషన్, అత్యాధునికమైన భవంతిని బహుమతిగా పొందనున్నందుకు సంతోషంగా, సంబరంగా ఉన్నాడు.

అతని ఆనందానికి ఒక్కసారిగా అడ్డుపడ్డట్టు ఎదురుగా ఉన్న రూట్ చూసి అదిరిపడ్డాడు. "డ్రైవర్ ఏమిటీ రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాం" అడిగాడు.

ఆ మరుక్షణం కారాగింది.

డ్రైవర్ తలతిప్పి వెనుక్కు చూసాడు.

ఈసారి పీటర్ ఫ్లోరిన్ మరింతగా అదిరి పడ్డాడు.

తన డ్రైవర్ కాదు, క్రొత్తవాడు. ఎలా మారాడు? ఎక్కడ మారాడు అని ఆశ్చర్యంతో ప్రశ్నార్థకంగా చూస్తూ మిగిలాడు.

ఆ డ్రైవర్ నవ్వుగా నవ్వి " ఈ సిటీకి ముందున్న క్లబ్‌లో రెండు పెగ్గులు విస్కీ త్రాగడానికి దిగినప్పుడే డ్రైవర్ స్థానంలోకి రాగలిగాను. నీకు ఆ క్లబ్ అంటే చాలా ఇష్టం. ఎప్పుడు జాఫర్‌సన్ సిటీవచ్చినా ఆ క్లబ్‌కు వెళ్తావు. అదే నీ దురదృష్టం అని హారన్ మ్రోగిస్తూ మరో చేత్తో పిస్తోలు గురి పీటర్ ఫ్లోరిన్ తలపై పెట్టి కాల్చాడు.

"యూ డెవిల్‌స్పై" అంటూ సిటులోకి ఒరిగిపోయాడు.

ఆ మరుక్షణం కారు కదిలింది.

కారు హారన్ మ్రోతలో పిస్తోలు ప్రేలిన శబ్దం కలిసిపోయింది.

★★★★

జాఫర్‌సన్ సిటీ వదిలి కారుయ నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద దూసుకుపోతోంది. డ్రైవర్ తీక్షణంగా ముమ్ముందు చేయాల్సింది ఆలోచిస్తున్నాడు. బాగా రక్తం ప్రవించి సైంటిస్టు వికృతంగా చనిపోయాడు. ముందు ఆ శవం వదిలించుకోవాలి ఆ పైన ఈ రక్తం కడిగేయాలి ఆ తరువాత లభించిన యుద్ధ విమానం నమూనా పత్రాలతో అమెరికా వదలాలి. కారు ఒక కొండవద్ద ఆపి శవాన్ని పొదల్లోకి నెట్టేసి మరళ కారుతో బయల్దేరాడు.

కారుతో నాలుగువందల కిలోమీటర్లు ప్రయాణం చేసాక, కారు ఆపాడు. ఇక ఈ కారుతో ప్రయాణిస్తే తనపై పోలీసువలలు పడక తప్పవు అని కారును కన్పించని విధంగా పెద్ద తటాకంలో దించేసి చేతులు దులుపుకున్నాడు.

డ్రైవర్‌గా అంతవరకు పాత్రలో ఇమిడిన అతడు కె.జి.బి. సంస్థలో సీనియర్ ఏజెంట్. ఎఫ్.ఎక్స్ సైంటిస్టును చంపి ఆ పత్రాలు సాధించాలని ఏడాది క్రితం వచ్చాడు. పని చాలా తేలికగా సాధించాడు. ఇక తను మాస్కో వెళ్ళిపోవాలి. ఇక ఇక్కడ్నించి చాలా తెలివిగా సాగాలి. ఏమాత్రం పొరపాటు చేసినా చిక్కులు పాలుకాక తప్పదు. ఆలోచిస్తూ కదిలాడు.

వారం దినాలు గడిచాయి.

న్యూమెక్సికో సిటీలోకి సురక్షితంగా రాగలిగాడు. కె.జి.బి. ఏజెంట్ ఎఫ్.ఎక్స్ మూడ్రోజుల క్రితమే సైంటిస్టు పీటర్ ఫ్లోరిన్ శవాన్ని పోలీసుల స్వాధీనం అయ్యింది. హంతకుడికోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు వార్తలు పత్రికల్లో చదివాడు ఏజెంట్ ఎఫ్.ఎక్స్.

న్యూమెక్సికోలో సాంటాఫీ సిటీలో రెస్టారెంట్‌లో కూర్చున్న ఎఫ్.ఎక్స్ టీ.వి. వార్తల్లో అనేక విషయాలు ఆసక్తిగా చూస్తున్నాడు. చివరగా సైంటిస్టు హంతకుడు న్యూమెక్సికోలో తిరుగాడుతున్నట్లు గూఢచార వర్గాలు కథనంగా చెప్తూ అనుమానించవదగ్గ వారిని అప్పగించడానికి సహకరించమని పోలీసు అధికార్ల విజ్ఞప్తి చూసి ఎఫ్.ఎక్స్ అక్కణ్ణించి లేచాడు.

ఆ ప్రక్కనే ఉన్న వన్యమృగాల ప్రదర్శన శాలలోకి వెళ్ళాడు.

రకరాకల జంతువులు బోనుల్లో పెట్టి ప్రదర్శిస్తున్నారు. చాలామంది అమెరికన్స్ చూస్తున్నారు.

అప్పటికే ఎఫ్.ఎక్స్ ఎందుకో తనను ఎవరో అనుసరిస్తున్నారని అనుమానించడం మొదలు పెట్టాడు. పైగా టీ.వి.లో ప్రకటన అతన్ని కలవర పరిచింది.

జంతువుల్ని చూస్తున్నవాడల్లా ఒకసింహం బోనువద్ద ఆగాడు. అది నిద్రపోతూ కన్పించింది. దాన్ని గూర్చి అడిగాడు అక్కడున్న సంరక్షకుడ్ని.

"బాగా అల్లరి చేయడంవలన మత్తు ఇచ్చాం ఇక్కడ వాతావరణం దీనికి అంతగా పడదు' అని బదులిచ్చాడు. ఆ వెంటనే అతడు అక్కణ్ణుంచి మరో బోనువైపు కదిలాడు.

ఎఫ్.ఎక్స్. సింహం బోనువద్దనే నిలబడి దాని మెడలో ఉన్న తోలుపటుకా చూసాడు.

యర్నగుల సుధాకరరావు

తనవద్ద ఉన్న యుద్ధ విమాన నమూనా పత్రాల్ని అందులో నిక్షిప్తం చేయడం ఎంతైన మంచిది అని నిర్ణయించి ఒక్కసారి సింహం సంరక్షకుడ్ని గమనించి తన పనిలో నిమగ్నుమయ్యాడు. పటికాలో మైక్రోఫిలిమ్ చుట్టను గ్రుచ్చి కన్పించకుండా రెండువైపులా గమ్ పేపర్ అంటించాడు. సింహంజూలు వెంట్రుకలు చేతులకు సూదుల్లా గ్రుచ్చుతున్నాయి. పైగా దాని శరీరం చాలా వేడిగా ఉంది. పడుకున్న ఆ సింహం బోనువైపు ఎవరూ పెద్దగా ఉత్సాహపడి రావడం లేదు. బోనులో చెయ్యిపెట్టి చకచక పని చేస్తున్న ఎఫ్.ఎక్స్ చీటికి మాటికి కను చివర్లనుంచి తనను ఎవరైన గమనిస్తున్నారేమోనని చూడసాగాడు.

తరువాత ప్రదర్శనశాలలో మిగిలిన జంతువుల్ని చూసాడు. కొద్దిరోజుల్లో జర్మనీ వెళ్ళిపోతుంది. ప్రదర్శన శిబిరం అని తెలుసుకుని చాలా సంబరపడ్డాడు. ఈలోగా అమెరికా నుంచి తప్పించుకోవాలి. తనవద్ద ఉన్న యుద్ధవిమాన పత్రాల మైక్రోఫిలిమ్ సింహం పటికాలో దాచినందున ఇక తను క్షేమంగా బయటపడగలనని దృఢంగా నమ్మాడు.

★★★★

సెప్టెంబర్ 21వ తేదీన ఏజంట్ ఎఫ్.ఎక్స్‌ను మిచిగాన్‌లో పోలీసులు అరెస్టు చేసారు. చాలాకాలంగా వలవేసి పకడ్బందీగా ఎరెస్ట్ చేసారు. ఇక ఇంటరాగేషన్‌లో ఎఫ్.ఎక్స్ పెదవి విప్పి ఏమీ చెప్పలేదు. నరకయాతన ఎలా ఉంటుందో తెలియపరిచారు. అయినా, అతని లో ఏ విధమైన మార్పులేదు. 25వ తేదీ సరికి పూర్తిగా కోమాలో పడిపోయాడు. అమెరికన్ గూఢచారి సంస్థలు ఎఫ్.ఎక్స్‌ను మామూలు మనిషిగా చేయడానికి అవసరమైన వైద్యం చేయించారు. అత్యంత దారుణంగా కొట్టడం వలన చాలాకాలం వరకు కోమాలోంచి తేరుకోలేకపోవచ్చునని సూచించాయి.

చివరికి డాక్టర్స్ అధీనంలో ఎఫ్.ఎక్స్.ను వదిలి స్పృహ ఎప్పుడు వస్తుందా అని గోతివద్ద కాచుకున్న నక్కల్లా ఎదురు చూడసాగారు.

డిశంబర్ 28న ఎఫ్.ఎక్స్‌కు తెలివి మెల్లగా రాసాగింది. తనపై డిమ్‌లైట్ వెలుతురు పడ్తోంది. శరీరం అంతా నీరసంగా కదలవీలు కాని స్థితిలో ఉంది. తను ఏమీ ఆలోచించే స్థితిలో లేడు. ఖళ్ ఖళ్‌మని దగ్గడం.

ఆ దగ్గరలో ఉన్న నర్సు పేషెంట్‌ను పరిశీలించి కోమాలోంచి బయటపడ్డట్టు అధికార్లకు తెలిసింది.

క్షణాల్లో ఎఫ్.ఎక్స్ చుట్టూ వైద్యులు గూఢచారసంస్థ అధికార్లు నిలబడ్డారు. వారివైపు చూసి కళ్ళు మూసుకున్నాడు పేషెంట్.

నాలుగురోజుల్లో మరికొంత కోలుకున్నాడు. అయితే ఎఫ్.ఎక్స్. మతిహీనుడుగా డాక్టర్స్ గుర్తించారు. అతడికి ఆకలి, దాహం, సమాజం ఇవేవీ గుర్తించే స్థితిలేదు అని తేల్చిచెప్పారు. మెదడు బాగా దెబ్బతింది అని చెప్పేసారు. గూఢచార సంస్థలు చేసేది లేక వెనుదిరిగాయి.

మరో రెండునెలలు గడిచాయి. మతిహీనుడుగా సూపర్బ్‌గా నటించిన ఎఫ్.ఎక్స్. మార్చి 3వ తేదీన ఆ హాస్పిటల్ నుంచి తప్పించుకుపోయాడు. అతి కష్టంమీద జర్మనీ చేరాడు. అక్కడ వన్యమృగ ప్రదర్శనశాల విషయమై వాకాబు చేసాడు. రెండు సర్కస్ కంపెనీలు వన్యమృగాల ప్రదర్శనలను చేస్తూ ఇటీవల వచ్చాయని చాలాచోట్ల ప్రదర్శించి ఆస్ట్రేలియా వెళ్ళి పోయినట్లు తెలుసుకున్నాడు.

ఎఫ్.ఎక్స్. ఒక ఏడాది అనేక దేశాలు తిరిగాడు. చివరికి తను రహస్య పత్రం (మైక్రోఫిలిమ్) దాచిన తోలుపటకా గల సింహం అమెరికాలోనే చనిపోయిందని తెలుసుకుని ఖంగుతిన్నాడు. మరళ న్యూమెక్సికో వెళ్ళి బరియల్ చేయబడ్డ చోటికి వెళ్ళి మట్టి తవ్వి బొమికల మధ్యగల తోలుపటకాను సాధించాడు. అయితే అతని శ్రమ వృథా అయ్యింది. పటకాలో మైక్రో ఫిలిమ్ లేదు.

ఎఫ్.ఎక్స్.కు శ్రమ తప్పితే ఫలితం లభించలేదు.

ఆ భయంకరమైన యుద్ధ విమానం తయారీ నమూనా కాలగర్భంలో కలిసిపోయింది. ఇటు అమెరికన్‌కు అటు కె.జి.బి.కి. దక్కకుండా పోయింది.

---

# రికార్డులు సృష్టిస్తున్న శెట్టి!

ఆశలు వుంటాయి. అందరికి కాని అవి నెరవేరేది కొందరికే' అని ఓ సినిమా కవి అన్నట్లు, రికార్డులు సృష్టించాలని బహుమందికి వుబలాటంగా వున్నా అవి కొంతమందే సాధించగలుగుతారు. అదే కోవలో రాజ్ అశోక్ శెట్టి ఒకరు.

గతంలో ఎన్నో సాహస కృత్యాలు కనబర్చి రికార్డులు సృష్టించిన రాజ్ అశోక్ శెట్టి ఇటీవల కేవలం ఇరవై రోజుల్లో గుజరాత్ రాష్ట్రంలోని నాన్‌పురం ప్రధాన తపాలా కార్యాలయం నుండి 1,10,500 ఉత్తరాలను అందుకొని మరోకొత్త రికార్డును సాధించారు.

కరాటే, క్రీడా, సినిమా రంగాలలో ఖ్యాతి గడించిన అశోక్ శెట్టి, గతంలో 50 అడుగుల నుండి దుముకడం, 27 మోటారు సైకిళ్ళను, కారు చక్రాలను ఉదరంపైకి ఎక్కించుకోవడం, విషం తాగడం వంటి సాహస కృత్యాలను కనబర్చి అశేష జనులను చకితులనుజేసి ఆకట్టుకున్నారు.



'ఎంటర్ ది డ్రాగన్' సినిమా అశోక్ శెట్టి సాహస కృత్యాలను జరుపడానికి స్ఫూర్తిని కలుగజేసింది. అందుకే ఆ సినిమాను ఒకమారు, పదిమార్లు కాదు వందమార్లు చూశారు. శెట్టి లాగే ఒక సినిమాను అనేకమార్లు చూసే మహానుభావులు ఎందరో వున్నారు. అయితే అశోక్ శెట్టిలా ఒక మంచి కార్యానికి స్ఫూర్తినందుకొని సాధన కొనసాగించేవారు ఎందరుంటారు?

గత ఫిబ్రవరి 25 నుండి మార్చి 20వ తేదీలోపు 1,10,500 ఉత్తరాలు అందుకున్నందుకు నాన్‌పురం ప్రధాన తపాలా కార్యాలయం అశోక్ శెట్టిని సన్మానించింది. దక్షిణ కర్నాటకలోని ఉడిపి ప్రాంతానికి చెందిన శెట్టి గుజరాత్‌లోని 'కరాటే కో హోడో' సంస్థకు డైరెక్టర్, ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు వహిస్తున్నారు.

'సర్వకరాటే'గా ఖ్యాతి గడించిన అశోక్‌శెట్టి ఉత్తమ సినీ నటుడు కూడా. 'ఉగ్రప్రతాపి, శివ రాజ్, అగ్నిపల్లకి' మొదలగు సినిమాలలో ఈయన నటించారు.

— కీర్తి.